క్లుప్తంగా

బంద్ కొనసాగింపు

కాణిపాకం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం కూడా ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు బంద్ కొనసాగింది. ఆరు నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలు నిలిపేశాయి. అలాగే పలు డెంటల్ ఆస్పత్రులు బంద్ పాటించాయి. ఆరోగ్యశ్రీ సేవల కోసం వచ్చిన ప్రజలు బంద్ కారణంగా అవస్థలు పడ్డారు. ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. కొంతమంది ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నారు. మరికొందరు మాత్రం బంద్ పూర్తయ్యాక వచ్చి చూపించుకుందని ఇంటి బాట పట్టారు. కాగా నెట్‌వర్క్ ఆస్పత్రులు బకాయిలు మంజూరయ్యేంత వరకు బంద్ విరమించేది లేదని తేల్చి చెబుతున్నాయి. ప్రభుత్వం స్పందించకుంటే బంద్ ప్రక్రియను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నాయి.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పట్టించుకోకుంటే సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ హెచ్చరించారు. శనివారం చిత్తూరులో జరిగిన పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, వైద్య సేవలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మూకుమ్మడిగా సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో కార్మిక సంఘ నాయకులు వాసు, జయశంకర్, వినాయక, సుబ్రమణ్యం, సుకన్య, ప్రవీణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చదరంగంతో ఆలోచనా శక్తి పెంపు



చెస్ ఆడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని వేపమానువీధిలో ది స్కూల్ ఆఫ్ చిత్తూరు చెస్‌ను వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, చెస్ అసోసియేషన్ చైర్మన్ బాబు ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చదరంగం అనేది అత్యంత ప్రజాదరణ కలిగిన ప్రపంచ క్రీడ అని, చదరంగం క్రీడ గొప్ప ఆలోచనా శక్తిని ఇస్తుందన్నారు. చెస్ అసోసియేషన్ చైర్మన్ బాబుప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వం రాజుల యుద్ధంలో ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులను మట్టి కరిపించేందుకు అనుసరించిన విధానాలతో చదరంగం పుట్టుకొచ్చిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదరంగంలో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఆర్‌బీ ప్రసాద్, సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు, స్కూల్ నిర్వాహకులు ఎస్‌ఆర్ దినేష్, లేఖ్య, మండి సుధా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు కుటీర పరిశ్రమల్లా బెల్టు షాపులు

చౌడేపల్లె: రాష్ట్రంలో కూటమి నేతలకు బెల్టు షాపులు, నకిలీ మద్యం తయారీ కుటీర పరిశ్రమల్లా మారాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం చౌడేపల్లెలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని దుయ్యబట్టారు. ములకలచెరువులో వెలుగు చూసిన నకిలీ మద్యం తయారీ పరిశ్రమపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించకపోవడం దారుణమన్నారు. నకిలా మద్యం తయారీలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వాటా వుందని స్థానికులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమ మద్యం కేసులో అరెస్టు చేశారని, నకిలీ మద్యం తయారీ కేసులో ఆ పార్టీ నేతలను ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు.

సేవలు నిర్వీర్యం..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ సిబ్బందికి సర్వేలతో పాటు కూటమి నేతలు ప్రతి దాంట్లో పెత్తనం చేస్తుండడంతో తలలు పట్టుకుంటున్నారు. తాము సచివాలయాలకు వస్తే సెల్యూట్ కొట్టాలని ఒక్కరు(కూటమినేతలు), కూటమిలోని ఒక వర్గానికి పని చేయకూడదని మరొకరూ, ఇప్పుడే ప్రజాప్రతినిధితో మాట్లాడానని..ఈ పంచాయతీకి నేనే లీడర్ అని.. మా మాట వినకుంటే పంపించేస్తామని.. లేదంటే మీరే వెళ్లిపోండంటూ బెదిరిస్తున్నారని పలువురు సిబ్బంది వాపోతున్నారు. ప్రధానంగా మండలంలోని వర్గపోరుకు సచివాలయ సిబ్బంది బలైపోతున్నారు. కూటమి నేతల పోరు పడలేక చాలామంది తప్పించుకు తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థపై కత్తి
- సర్వే పేరిట సిబ్బందికి వేధింపులు
- సెలవుల్లో కూడా విధులకు రావాలని హుకుం
- మధ్యలో కూటమి నేతల పెత్తనం
- తాము చెప్పినట్లు చేయండి..లేదంటే వెళ్లిపోండంటూ బెదిరింపులు
- ఎవరికీ చెప్పుకోలేక దినదినగండంగా నెట్టుకొస్తున్న ఉద్యోగులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి ప్రభుత్వ తీరుతో ప్రజలకు సేవలందించే సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తమవుతోంది. రోజురోజుకూ సచివాలయ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం అమలు చేస్తున్న రోజుకో సర్వేల భారంతో సతమతమవుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న పని ఒత్తిడితో నిర్వేదానికి గురవుతున్నారు. సెలవుల్లో కూడా తీరిక లేకుండా తిరుగుతున్నారు. రానిపక్షంలో అధికారులు విధులకు బలవంతంగా పిలుస్తున్నారు. దీంతో సర్వేలను సిబ్బంది వ్యతిరేకిస్తున్నారు. దీంతో పాటు కూటమి నేతల పెత్తనంతో విధులు నిర్వర్తించే లేక తలలు పట్టుకుంటున్నారు.

సర్వేల్లో సిబ్బంది.. పడిగాపుల్లో ప్రజలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ సిబ్బందిని పూర్తిగా సర్వేలకు మాత్రమే పరిమితం చేయడంతో సచివాలయ వ్యవస్థ పూర్తిగా దారి తప్పింది. వివిధ సేవల నిమిత్తం సచివాలయాలకు వెళ్లే ప్రజలు.. అక్కడ సిబ్బంది లేక పడిగాపులు కాస్తున్నారు. నెలల తరబడి సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండల కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. చిత్తూరు మండలంలో 9 సచివాలయాలు ఉన్నాయి. వీటి కింద 10 వేల కుటుంబాలు ఉన్నాయి. వీరికి సేవలందించేందుకు వివిధ శాఖలకు సంబంధించి 75 మందికిపైగా సచివాలయ సిబ్బంది పని చేస్తున్నారు. గతంలో వలంటీర్లు చేసే పనిని ఇప్పుడు సచివాలయ సిబ్బందితో సర్వేలు చేయిస్తుండడంతో వారు విసుగు చెందుతున్నారు. ఉద్యోగులుగా తాము ఎలా పని చేయాలని, ఒత్తిడి తగ్గించాలంటూ ఇప్పటికే పలుమార్లు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సెలవు దినాలు, పండుగల నాడు కూడా వదలకుండా బలవంతంగా సర్వేలు చేయిస్తుండడంతో ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

ఇవేమి సర్వేలు..

సచివాలయంలో పని చేసే ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి సర్వేలు చేయలేమని ఇప్పటికే పలుమార్లు అధికారులను వేడుకుంటున్నా వారి ఆవేదనను లెక్కలోకి తీసుకోవట్లేదు. మరోవైపు తాము క్షేత్రస్థాయిలో సర్వే చేసే సమయంలో తీవ్ర అవమానానికి గురవతున్నామని, తమ ఆత్మ గౌరవానికి భంగం వాటిల్లుతోందని వాపోతున్నారు. విద్యార్హతల ఆధారంగా విధులు అప్పగించాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం మనమిత్ర, కౌశల్యం, పీ4, రైస్‌కార్డుల పంపిణీ, వాహన డేటా, ఆధార్ సీడింగ్, చైల్డ్ విత్ ఆధార్, బర్త్ సర్టిఫికెట్ల వంటి వాటి కోసం ఇంటింటికీ తిరిగి సర్వేలు చేయాల్సి ఉందని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. కానీ తమ సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఉద్యోగుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారికి రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లు, కేడర్ మార్పు, ప్రమోషన్లు, పారదర్శక బదిలీలు వంటి వాటిని చేపట్టాలని కోరుతున్నా వాటిని తుంగలో తొక్కుతున్నారనే విమర్శలు చేస్తున్నారు.

గతంలో గడపగడపకు సేవలు

స్థానిక సంస్థలను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 2019 అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి రోజున మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. అందులో భాగంగా సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. వాటి కోసం ఊరూరా శాశ్వత ప్రభుత్వ భవనాలు నిర్మించి ప్రజల ముంగిటకే పాలనను తీసుకెళ్లారు. ఒక్కో సచివాలయం పరిధిలో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, వెల్ఫేర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, పశుసంవర్థక శాఖ అసిస్టెంట్, ఉద్యాన శాఖ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ తదితర పోస్టులను నియమించారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి ప్రభుత్వ పాలనను కొత్త పుంతలు తొక్కించారు. గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి సంక్షేమ ఫలాలు నేరుగా గడప వద్దకే చేర్చారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని విన్ ఆస్పత్రిలో ఆదివారం అవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అవోపా సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, న్యూరాలజీ, యూరాలజీ, కంటి చికిత్సలు, డయాబెటిస్ వంటి వ్యాధులకు ఉచితం సేవలందిస్తారన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం ప్రముఖ కంటి వైద్యశాల చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ వారిచే మిషన్ ఫర్ విజన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిస్తారని నిర్వాహకులు లక్ష్మీపతి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. కంటి పరీక్షలకు హాజరయ్యే వారు తమ వెంట ఆధార్ కార్డు తీసుకురావాలని చెప్పారు. శస్త్ర చికిత్సకు ఎంపికైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా పెరటాసి పూజలు

నదుం: మండలంలోని కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రంలో పెరటాసి మాసం నాలుగో శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉపవాసాలు ఉండి, తిరునామాలతో ఇళ్లలో నైవేద్యం సమర్పించారు.

ఘనంగా పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బేబి కిట్స్ పంపిణీ చేస్తున్న విజయానంద రెడ్డి నాయకులు



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో శనివారం మాజీ రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినవేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తొలుత కొంగారెడ్డిపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, నాయకుల నడుమ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే కార్పొరేట్ హరిణిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బేబికిట్స్ పంపిణీ చేశారు. అనంతరం విజయానందరెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర మొదలియార్ విభాగం అధ్యక్షుడు జ్ఞాన జగదీష్ ఆధ్వర్యంలో దక్షిణమూర్తి ఆలయంలో పూజలు, తేనెబండ నీవానది ప్రాంతంలో అన్నదానం, సంతపేట కూడలిలో భారీ కేక్ కటింగ్, మధ్యాహ్నం ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి గాయత్రిదేవి, నాయకులు పురుషోత్తంరెడ్డి, అంజలిరెడ్డి, హరీషారెడ్డి, గిరిధర్‌రెడ్డి, రామ్‌గణేష్, సుగుణశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శివరెడ్డి, నారాయణ, కృష్ణారెడ్డి, శ్రీనివాసన్, విజయసింహారెడ్డి, గణేష్, టిమ్ము, చక్రవర్తిరెడ్డి, సదాం, హిమద్, మహేష్, రవి, మురుగేష్, దినేష్, లక్ష్మణ కుమార్, త్యాగరాజు, రజనీ, హరిప్రసాద్, హరికృష్ణ, ఆరినేని శివ, యాగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురకంబట్టులో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని మురకంబట్టులో జైకుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, భూషణంరెడ్డి, హరినాథ, శీలంభాస్కర్, సోమల బాషా, షాహిద్, ప్రసాద్, శంకర్‌రెడ్డి, మంజునాథ్, ముబారక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా మండలంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హరిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, పార్టీ నాయకులు, యువత ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

పర్యావరణ రక్షణకు కృషి చేద్దాం



గుడిపాల: విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న సంస్థ ప్రతినిధులు

గుడిపాల: చెన్నై–బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ హైవే ఫేజ్–3 మాంటోకార్లో లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. గుడిపాల సీఎస్‌ఆర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎక్స్‌ప్రెస్ హైవే ప్రత్యేక అధికారి అజయ్‌కుమార్ మారియా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే మోపత్తి కనికాపురం వద్ద ప్రత్యేక క్యాంపులో భాగంగా మొక్కలు నాటారు. చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సంసూల హైక్యూ మాట్లాడుతూ చెట్లు పర్యావరణాన్ని రక్షిస్తాయని, భూమిపై చెట్ల వల్లవచ్చని వాతావరణం నెలకొంటుందన్నారు. చెట్లు అనేక జీవులకు నివాసం కల్పించి కార్బన్‌యాక్సైడ్ తీసుకుని మనకు ఆక్సిజన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ చంద్రచటాయి, ఇన్‌చార్జ్ జోలేందర్ సింగ్, అడిషనల్ జనరల్ మేనేజర్ ముఖేష్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్ పాల్గొన్నారు.

నిండుకుండలా బీరప్పచెరువు



మొరవ సాగుతున్న బీరప్పచెరువు

ఐరాల: మండల వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మండలంలోని బీరప్పచెరువు పొంగి మొరవ సాగుతుంది. చెరవు కట్ట కింద ఆయకట్టుదారులు సేద్యం పనులకు సన్నద్ధం అవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లాయి. చెరువులు, కుంటలు నిండుకుండాల కళకళలాడుతున్నాయి. ఫలితంగా భూగర్భజలాల నిల్వలు పెరిగాయని రైతులు చెబుతున్నారు. దీంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌లో పంటల సాగుకు అవసరమైన నీటి వనరులు సమకూరాయని భావిస్తున్నారు. బోరుబావుల్లో సైతం జలాలు పెరిగాయి. అలాగే మండలంలోని పెద్ద చెరువైన చుక్కావారిపల్లె చెరువు నిండి మొరవ సాగుతుంది. మండలంలో సెప్టెంబర్ చివరి నాటికి 60 శాతం వర్షం కురిసినట్లు ఏఓ వరలక్ష్మి తెలిపారు.

వాస్తవానికి ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు కురవలేదు. జూలై మూడో వారంలో ఓ మోస్తారు వర్షాలు మాత్రమే కురిశాయి. ఆగస్టు, సెప్టెంబర్, ప్రస్తుతం సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో అధిక వర్షపాతం నమోదైంది. రానున్న రబీ సీజన్‌కు నీటి కొరత ఉండదని అధికారులు చెబుతున్నారు.

గోవిందాశ్రిత గోకులనంద..



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తి, (ఇన్‌సెట్) శ్రీవారి పాదాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం గోవిందరాజులగుట్టలో శనివారం శ్రీవారిపాదానికి విశేష పూజలు నిర్వహించారు. తొలుత శ్రీవారి పాదానికి పాలాభిషేకం చేసి పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తిని అలంకరించి విశేష పూజలు చేశారు. గోవింద నామస్మరణతో గుట్ట మార్మోగింది. భక్త జనంతో పోటెత్తింది. కార్యక్రమంలో తాళంబేడు సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, ఆలయ సభ్యులు రుకేష్‌నాయుడు, కృష్ణారెడ్డి, శ్రీరాములునాయుడు, సోమనాథరెడ్డి, గోపిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటేసిన వారిని కాటేసే నైజం బాబుది

- ప్రజల్లోకి కూటమి ప్రభుత్వ మోసాలను తీసుకెళ్దాం
- 17 నెలల కూటమి పాలనలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదు
- ప్రజలను వంచించడం చంద్రబాబుకే సాధ్యం
- బాబు ష్యూరిటీ మోసం–గ్యారెంటీకి విశేష స్పందన
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ మోసమే జరిగిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు చిత్తూరు నగరంలోని 29వ డివిజన్ మిట్టూరు పరిధిలో ఉన్న రెడ్డీస్ కాలనీలో శనివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం పార్టీ నాయకులు కార్తీక్, క్రాంతీల ఆధ్వర్యంలో చేపట్టారు. ముందుగా సమన్వయకర్త విజయానందరెడ్డి క్యూఆర్ కోడ్ ఆవిష్కరించి డాక్యుమెంట్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన బాండ్ల గురించి, ప్రజలకు చేస్తున్న మోసాల వల్ల నష్టం ఎంత జరిగిందనేది ఉందని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు నోట బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారంటీ అనే మాట వినిపించేదని.. ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ అనే మాట వినిపిస్తోందన్నారు. సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ మేనిఫెస్టోలో 143 హామీలిచ్చారని.. ప్రస్తుతం వాటిని గాలికొదిలేశారన్నారు.

సూపర్ సిక్స్‌తో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని చంద్రబాబును ప్రజలు నిలదీసే పరిస్థితులు త్వరలోనే రానున్నాయన్నారు. 17 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం నిర్వహించలేదని మండిపడ్డారు. ఓటేసిన వాడిని కాటేసే నైజం చంద్రబాబుకే సాధ్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సూపర్.. డూపర్ మోసాలు

చంద్రబాబునాయుడు చెప్పిన పథకాల్లో కొన్నింటిని అరకొరగా అందించి.. మరికొన్ని అమలే చేయకుండా సూపర్‌సిక్స్ పథకాలు సూపర్ హిట్ అంటూ ప్రచారం చేసుకోవడం దారుణమని విజయానందరెడ్డి విమర్శించారు. కూటమి సూపర్ డూపర్ మోసాలపై ప్రతి కార్యకర్త ప్రతి ఇంటికీ వెళ్లి తెలియజేయాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నిస్సిగ్గుగా అబద్ధాలు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను జూన్ 2024 నుంచి అమలు చేస్తానని మొదటి ఏడాది మొత్తం ఎగ్గొట్టారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు శఠగోపం పెట్టారన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని.. అరకొరగా నిధులు జమచేశారని విమర్శించారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఆడబిడ్డ నిధి పథకాల ఊసే లేకుండా మంగళం పాడేశారన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా, రైతులను నష్టాల ఊబిలోకి నెట్టేశారన్నారు.

ప్రశ్నించే వారిపై కేసులు..

చంద్రబాబు తన అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకు ప్రశ్నించే వారిపై పోలీసులను ఉసిగొల్పి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం, జైలుకు పంపడం దారుణమని డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ విమర్శించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కాపీ కొట్టడం తప్ప, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు సొంత ఆలోచన ఉండదన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలకు పేర్లు మార్చి, అంతా తన గొప్పేనంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. దేశ చరిత్రలో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తెచ్చిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేరుతో చంద్రబాబు రూ.కోట్ల విలువ చేసే భూములను ఎకరా వంద రూపాయలకు ప్రైవేట్ పరం చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, ఉద్యోగులు, పెన్షనర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, క్రాంతికుమార్, గుణశేఖర్‌రెడ్డి, గణపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కుమార్‌స్వామిరెడ్డి, శిరీష్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, ఉన్నికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన రిజిస్ట్రేషన్ రాబడి

చిత్తూరు కార్పొరేషన్ : 2024–25 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ రాబడి పెరిగింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.221.88 కోట్లు లక్ష్యానికి గానూ కేవలం రూ.149.88 కోట్లు ఆదాయం మాత్రమే వచ్చింది. నిర్దేశించిన మొత్తంలో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు 67.55 శాతం మాత్రమే లక్ష్యం మాత్రమే చేరుకోగలిగారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల కాలంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ రాబడి పెరిగి.. గత ఏడాదితో పోలిస్తే వృద్ధి శాతం పెరిగింది. జిల్లాలోని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రూ.106.90 కోట్ల రాబడి లక్ష్యాన్ని నిర్దేశించింది. రూ.78.18 కోట్లు రిజిస్ట్రేషన్ జరిగి 73.09 వృద్ధి శాతం సాధించారు. జిల్లాలో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు గత నెలాఖరుకు 29,964 జరిగాయి. ప్రతి నిత్యం జిల్లావ్యాప్తంగా రూ.45 లక్షల నుంచి రూ.55 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయంలో 13.36 శాతం వృద్ధి నమోదైంది. భూములు, స్థలాల మార్కెట్ విలువ పెంపుతో ఈ ఏడాది రూ.220 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉన్నట్లు జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అంచనాలు వేశారు.